

జడ్పీలో.. జగడాలు?

- పాలనలో ఎవరి దారి వారిదే
- పాలకవర్గం, అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య అగాధం
- పరీక్షలు సమీపిస్తున్నా స్టడీ మెటీరియల్, అల్పాహారం అందని వైనం

- జడ్పీ చైర్‌పర్సన్ చెప్పింది సీఈవో చెయ్యరు. ఫైల్లు పంపిస్తే ఆపేస్తారు.
- సీఈవో మీటింగ్ ఏర్పాటు చేస్తే చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో హాజరు కారు.
- డిప్యూటీ సీఈవో ఫైల్ పంపిస్తే సీఈవో పక్కన పెట్టేస్తారు.
- జనవరి 1న విడుదల కావాల్సిన జిల్లా పరిషత్ డైరీ ఫిబ్రవరి వచ్చినా సిద్ధం కాలేదు.
- ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన స్టడీ మెటీరియల్ ఇంకా ప్రింట్ కాలేదు.
- సాయంత్రం పదో తరగతి పిల్లలకు పెట్టాల్సిన అల్పాహారంపై అసలు నిర్ణయమే జరగలేదు.



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు జిల్లా పరిషత్‌లో నెలకొన్న పరిస్థితి. పాలకవర్గం, అధికారుల మధ్య అగాధం నెలకొందని పై పరిణామాలు చూస్తే అర్థమవుతోంది. జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య సమన్వయ లోపం పాలనలో ప్రతిబింబిస్తోంది. గుంటూరు జిల్లా మూడు ముక్కలు అయినా జిల్లా పరిషత్ ఇంకా ఉమ్మడిగానే ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల అభివృద్ధి చిరునామా జిల్లా పరిషత్ మాత్రమే. అటువంటి జిల్లా పరిషత్ అంతర్గత కుమ్ములాటల్లో చిక్కుకుంది. పాలకవర్గానికి ప్రతినిధిగా ఉన్న చైర్‌పర్సన్‌కు, కార్యనిర్వాహక వర్గానికి ప్రతినిధులుగా ఉన్న సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య అగాధం ఏర్పడింది. ఏమి జరిగిందో ఏమో కానీ ముగ్గురు మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ మధ్య జరిగిన అనేక సంఘటనలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఇటీవల జడ్పీలో ఈ-ఆఫీసుపై సీఈవో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో అందుబాటులో ఉన్నా ఆ సమావేశానికి హాజరుకాలేదు. సీఈవో ఒక్కరే సమావేశాన్ని జరిపించేశారు. గత వారంలో గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవోలు సచివాలయ వ్యవస్థ వల్ల ఎదురౌతున్న ఇబ్బందులను చైర్‌పర్సన్ ముందు ఏకరువు పెడుతున్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సీఈవో ఆ అంశాన్ని మధ్యలోనే ముగించారు. కొన్ని సందర్భాల్లో చైర్‌పర్సన్ మాట్లాడుతున్నా ఆయన అడ్డుతగిలినట్లు అనిపించింది.

విద్యార్థుల ఎదురుచూపులు..

పదో తరగతి విద్యార్థులకు ఏటా జిల్లా పరిషత్ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ ఏడాది పరీక్షలకు కేవలం రెండు నెలల వ్యవధి కూడా లేదు. అయినా ఇంతవరకు ఆ ఊసే వినిపించడం లేదు. జడ్పీ పాఠశాలల్లో స్టడీ అవర్‌కు ఉండే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత జడ్పీదే. గత కొన్ని రోజులుగా పాఠశాలల్లో స్టడీ అవర్లు జరుగుతున్నాయి. అయినా ఇప్పటి వరకు అల్పాహారం ఊసే లేదు. అందుకు సంబంధించిన నిధుల విడుదలపై అసలు చర్చ కూడా జరిగినట్లు లేదు.

ఫైల్లు చక్కర్లు కొట్టాల్సిందే..

ఇక జడ్పీలో ఏ ఫైల్ అయినా కనీసం మూడు నెలలకు తగ్గకుండా చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిందే. కొన్ని కొన్ని సందర్భాల్లో అసలు ఫైల్ ఎవరి దగ్గర ఉందో తెలుసుకోవడం కూడా కష్టంగానే ఉందని జడ్పీవర్గాల సమాచారం. ఈ పరిణామాల మధ్య జడ్పీలో ఫైళ్ల వ్యవహారం కత్తిమీద సాములానే ఉంది. కొన్ని వందల ఫైళ్లు పేరుకుపోయి నట్లు తెలుస్తోంది. ఏ ఫైల్‌ని కూడా సక్రమంగా పరిష్కరించడం లేదన్న విమర్శలున్నాయి. చైర్‌పర్సన్ క్లియర్ చేసిన ఫైల్‌ను సీఈవో పెండింగ్‌లో పెడుతున్నట్లు తెలుస్తోంది. సీఈవో పంపుతున్న ఫైల్‌ను డిప్యూటీ సీఈవో పెండింగ్‌లో పెడుతున్నట్లు సమాచారం.

ఉద్యోగుల ఇష్టారాజ్యం..

ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఉన్న కొందరు ఉద్యోగులకు, అధికారులకు మధ్యాహ్నం వరకే విధులు అన్న విధంగా ఉంది. భోజన విరామం తర్వాత చాలా మంది ఇళ్లకు వెళ్లిపోతున్నారు. అదేమని అడిగే నాథుడు లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక వేళ సీఈవో దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళినా మందలించలేని పరిస్థితి.

చెల్లింపులన్నీ బంద్..

జడ్పీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితిల వల్ల చాలా వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. గత సర్వసభ్య సమావేశానికి సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ ఫైల్ ఎవరి దగ్గర పెండింగ్‌లో ఉందో ఎవరికీ తెలియదు. కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు కూడా ఈ మధ్య కాలంలో చాలా కాలం పెండింగ్‌లో ఉంచారు. ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు కూడా చాలావరకు పెండింగ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది.

అవినీతి తాండవం..



చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య ఉన్న అంతరం కారణంగా జిల్లా పరిషత్‌లోని కొన్ని విభాగాల్లో అవినీతి తాండవిస్తోంది. అడిగినంత ఇస్తే తప్ప అక్కడ పనులు కావడం లేదని ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని సెక్షన్ల ఏవోలు ఆడిందే ఆట పాడిందే పాట అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో రూ.2 లక్షల వరకు వెచ్చించి జడ్పీకి బదిలీ అయిన అధికారులు వాటిని సమకూర్చే పనిలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి.





జిల్లా వాసుల్లో నిరాశ

బాపట్ల జిల్లాకు ఆయువు పట్టుగా ఉన్న పర్యాటక రంగం గురించి కేంద్ర బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడంతో జిల్లావాసులు నిరాశకు గురయ్యారు. జిల్లాలో ప్రధానమైన మత్స్యకారులు, ఆక్వారంగాలపై నిర్మలమ్మ పద్దు వరాలు కురిపిస్తుందనుకుంటే ఆ ఊసే కరువైంది. గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన అనేక ప్రాజెక్టులకు సంబంధించి నేతలు నిధుల విజ్ఞాపనలు కేంద్రానికి ఇచ్చినా బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కలేదు. సమీకృత ఆక్వా ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో చోటు దక్కకపోవడంతో జిల్లాప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఆక్వా రంగం విషయంలో ఇచ్చిన ప్రతిపాదనలను కూడా కేంద్రం బుట్ట దాఖలు చేసిందనే విమర్శలున్నాయి.

ఉద్యోగుల్లో.. ఉత్సాహం

- బడ్జెట్‌పై పెన్షనర్ల ఆనందోత్సాహాలు
- పన్ను మినహాయింపుపై ఆయా వర్గాల్లో సంబరాలు
- కొనుగోలు శక్తిని పెంచుతుందంటున్న ఆర్థిక నిపుణులు

గుంటూరు, విద్య, తూర్పు, బాపట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు.. పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహం.. వివిధ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో సహకారం ఉంటోందని ప్రజలు ఆశించారు. అయితే ఉద్యోగులు, పెన్షనర్లను మాత్రమే నిర్మలా సీతారామన్ ఉత్సాహపరిచారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పెన్షనర్లు, ఉద్యోగులకు వరాల జల్లు కురిపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రూ.12.75 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదనే తీపికబురు ప్రకటించారు. దీంతో ఉద్యోగులకు వారి జీతాలను బట్టి రూ.30 వేల నుంచి రూ.80 వేల వరకు ఆర్థిక ఉపశమనం కలుగుతుంది. సంవత్సరానికి రూ.12 లక్షల కంటే ఎక్కువ సంపాదించే సాఫ్టువేర్ తదితర రంగాలకు చెందిన ఉద్యోగులకు కూడా దీనిని వర్తింపు చేశారు. ఈ విధంగా అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు ఉద్యోగులకు కొత్త ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఆర్థిక ప్రయోజనాలను కల్పించారు. ఎప్పుడైతే బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాన్ని ఆమె ప్రకటించారో ఆ వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. సహచర ఉద్యోగులకు ఫోన్లు చేసుకుని ఎంత లబ్ధి జరుగుతుందో పరస్పరం పంచుకున్నారు. బడ్జెట్‌పై ఆర్థిక, విద్యావేత్తలు, వామపక్షాల నాయకులు తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వ్యవసాయానికి ఊతం



కేంద్ర బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయరంగానికి ఊత మిచ్చేదిలా ఉన్నది. జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్(జీబీఎన్ఎఫ్)కు రాష్ట్రానికి కేటాయించిన రూ.186 కోట్లలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు భారీగానే నిధులు సమకూరుతాయని వ్యవసాయ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో దాదాపుగా 20 వేల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా వారికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉండనున్నది. అదేవిధంగా బాపట్ల జిల్లాలో 40,000 ఎకరాల వరకు సాగు విస్తరించొచ్చనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రెండు జిల్లాల్లో కొత్తగా పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా కేంద్ర బడ్జెట్ కేటాయింపులున్నాయని అధికారులు చెబుతున్నారు. కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితి పెంపుతో లక్షల మంది రైతులకు ఆర్థికంగా లబ్ధి జరుగుతుంది. గుంటూరు జిల్లాలో దాదాపుగా 3.50 లక్షలు, బాపట్ల జిల్లాలో 55,000 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులున్నాయి. ప్రస్తుతం రుణపరిమితి రూ.3 లక్షలు కాగా దీనిని రూ. 5 లక్షలకు పెంచడంతో వ్యవసాయంతో పాటు మత్స్య, పశు సంవర్థక రంగాల్లో రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఎంఎస్ఎంఈలపై వరాలతో గుంటూరు జిల్లాలో దాదాపుగా 71 వేల సంస్థలకు మేలు జరగనున్నది. కొత్తగా పరిశ్రమలను విస్తరణతో పాటు ఉత్పాదక శక్తిని పెంచుకొని ఎగుమతులు మరింతగా చేసే అవకాశం కలుగుతోంది.

పెట్టుబడిదారులకు వరం

కేంద్ర బడ్జెట్ సామాన్యులకు శాపంగా, బడా పెట్టుబడిదారులకు వరంగా ఉంది. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావనే లేకపోవడం విచారకరం. రైతుల పంటలకు కనీస మద్దతు ధరపై ప్రకటన చేయలేదు. విద్యుత్ రంగంలో సంస్కరణలకు ప్రోత్సాహకాలు దుర్మార్గం. డ్వాక్రా మహిళలు, ఎంఎస్ఎమ్ఈలకు రుణాలు పెంచి ఇస్తామని చెప్పడం వారి చేత అప్పులు చేయించడమే లక్ష్యంగా కనిపిస్తుంది.

- జంగాల అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి, గుంటూరు

రాష్ట్రానికి మొండిచేయి

కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, విభజన హామీలు, రాజధాని నిర్మాణం వంటి విషయాల్లో మొండిచేయి చూపింది. పోలవరానికి రూ 5,936 కోట్లు, ప్రాజెక్ట్ అథారిటీకి రూ 54 కోట్లు కేటాయించారే కానీ నిర్వాసితుల గురించి ప్రస్తావనలేదు. వేతన జీవులకు పన్నులు తగ్గించామని చెబుతూ పేద, బడుగు వర్గాలు, మధ్యతరగతి ప్రజలపై జీఎస్టీ పేరుతో భారాలు మోపుతున్నారు.

- వై నేతాజి, సీపీఎం జిల్లా కార్యదర్శి, గుంటూరు

అన్యాయం.. దురదృష్టకరం

రాష్ట్రాభివృద్ధికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు లేకపోవటం దురదృష్టకరం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరించమని, దానికి మైన్స్ కేటాయిస్తామన్న వారు బడ్జెట్‌లో చూపించలేదు. బీమా, బ్యాంకింగ్ రంగాలనుప్రైవేటు కంపెనీల చేతుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుంది.

- మస్తాన్‌వలి, మాజీ ఎమ్మెల్యే, గుంటూరు

సంక్షేమం.. అభివృద్ధి

రైతులు, మహిళలు, మధ్య తరగతి, యువత ఇలా ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్రబడ్జెట్ ప్రవేశ పెట్టారు. రూ.730 కోట్లు ఇవ్వడం ద్వారా విశాఖ పోర్టు సామర్థ్యం పెరుగుతుంది.

- చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, గుంటూరు

నిరాశ మిగిల్చింది

కేంద్ర బడ్జెట్ నిరాశ మిగిల్చింది. విభజన చట్టంలో హామీలకు నిధులు కేటాయించలేదు. వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు, చర్యలు లేవు. ఉపాధి పెంచే దిశగా బడ్జెట్ లేదు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా బడ్జెట్ ఉంది. ప్రైవేటీకరణకు అన్ని రంగాల్లో పెద్దపీటవేశారు.

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఐటీకి శుభపరిణామం

మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకుని ఐటీ విధానంలో మినహాయింపులు కల్పించినట్లుగా భావించవచ్చు. ఆదాయపు పన్ను శ్లాబు విధానంలో మార్పులు, టీడీఎస్, టీసీఎస్ విధానాల్లో కూడా మినహాయింపులు కల్పించారు. వీధి వ్యాపారులకు ముఖ్యంగా రూ.30 వేల వరకు క్రెడిట్ కార్డ్ అందజేస్తామని చెప్పారు. వడ్డీ వ్యాపారుల బారిన పడి వీధి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్రెడిట్ కార్డ్ విధానంతో వారికి ఆర్థిక పరిపుష్టి కల్పించినట్లవుతుంది. వడ్డీపై టీడీఎస్‌ను సీనియర్ సిటిజన్లకు పెంచటం మంచి విషయంగా చెప్పవచ్చు.

- రామరాజు శ్రీనివాస్, మాజీ చైర్మన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్‌జోన్

ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ఆదాయపు పన్ను శ్లాబు విధానంలో మార్పులు ఆర్థికాభివృద్ధికి దోహదం చేకూరుస్తుంది. కరోనా వలన ఆర్థిక వ్యవస్థకు కొంతమేరకు ఇబ్బంది కలిగింది. ఈ నేపథ్యంలో పన్ను మినహాయింపుల వల్ల ఉద్యోగులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దాంతో వారు కచ్చితంగా తమకు ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేయడం, స్థిరాస్తి, రియల్‌ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం వంటివి చేస్తారు. ఇది ఆర్థిక వ్యవస్థని బూస్టప్ చేస్తుంది. బడ్జెట్‌తో చిన్న పరిశ్రమలు, రైతులకు భారీ ఊరట లభించింది.

- ఆడిటర్, దామచర్ల శ్రీనివాసరావు, గుంటూరు

తగ్గింపులు మరింత పెంచాలి

ప్రభుత్వానికి నికరంగా పన్నుల రూపంలో ఆదాయం సమకూరుస్తున్నది ఉద్యోగులే. ప్రామాణిక తగ్గింపు రూ.75 వేలతో కలిపి వార్షికాదాయం రూ.12 లక్షలు ఉంటే ఆదాయపు పన్ను మినహాయింపు కొంత మేరకు ఊరటనిస్తుంది. అయితే తాము తొలి నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది స్టాండర్డ్ డిడక్షన్(ప్రామాణిక తగ్గింపు)ని రూ.5 లక్షలకు పెంచమంటున్నాం. అప్పుడే ఉద్యోగులకు మేలు కలుగుతుంది. వ్యాపారులు ఐటీ రిటర్న్ ఫైల్ చేసి పన్నుల నుంచి తప్పించుకొంటారు. ఉద్యోగులు మాత్రం అలా కాదు. ఈ నేపథ్యంలో ఇంకాస్త మినహాయింపులు ఇస్తే బావుండేది.

- షేక్ చాంద్‌బాషా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

జీఎస్టీ శ్లాబులు తగ్గించకపోకవడం సరికాదు

జీఎస్టీ శ్లాబులు తగ్గించాలని తొలి నుంచి డిమాండ్ చేస్తూ వస్తున్నాం. బడ్జెట్ ప్రకటనలోనూ శ్లాబులను తగ్గించపోవటం విచారకరం. రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయింపులు లేకపోవడం నిరాశ కలిగించింది. బడ్జెట్‌లో చిన్న వ్యాపారులకు పెద్దగా లాభం చేకూర్చింది లేదు.

- ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు.



రేషన్.. కోత

అరకొరగానే కందిపప్పు

- బియ్యం, పంచదారకే పరిమితం
- రాగి, గోధుమ పిండి, జొన్నలు నిలిపివేత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) రేషన్ సరుకులు అంటే.. బియ్యం, పంచదారకే పరిమితమైంది. గతంలో రేషన్ అంటే బియ్యం, పంచదార, కందిపప్పు, రాగులు, సజ్జలు, గోధుమలు, గోధుమపిండి, మార్కెట్‌లో అధిక ధరలున్న నిత్యావసరాలు సబ్సిడీపై అందేవి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల రేషన్ వ్యవస్థను పూర్తిగా మార్చేయడంతో పాటు సరుకుల్లో కోత విధించింది. రేషన్ కార్డుదారులకు బియ్యం మాత్రం అందించారు. కొన్ని దగ్గర్ల అయితే పంచదార కూడా సక్రమంగా అందేది కాదు. ఇక బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, నూనెలు మండిపోతున్నా వాటి ఊసే నాటి ప్రభుత్వం మరిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్‌లో కొన్నింటిని పునరుద్ధరించినా అది రెండు నెలలకే పరిమితమైంది. ప్రస్తుతం గత వైసీపీ హయాంలో మాదిరిగానే బియ్యం, పంచదారకే రేషన్ పరిమితమైంది. పేదలకు సరుకుల పంపిణీలో కూటమి ప్రభుత్వం కూడా కోత విధించింది. ఏ నెలకానెల కందిపప్పు పంపిణీ తగ్గించి వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ విస్మరించింది. కందిపప్పు అడిగితే పంపిణీ దారులు స్టాక్‌లేవంటున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు గోధుమ, రాగి పిండి సరఫరా నిలిచిపోయింది. జొన్నలు ఒక్క పల్నాడు జిల్లాకే అది కూడా 7.80 లక్షల కార్డుదారులకు, గుంటూరు జిల్లాలో 1,464 మంది కార్డుదారులకు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాకు జొన్నల సరఫరా పూర్తిగా నిలిపివేశారు. రాగి పిండి గుంటూరు జిల్లాలో 115 మంది కార్డుదారులకు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల, గుంటూరు జిల్లాలకు రాగి పిండి పూర్తిగా నిలిపివేశారు. కందిపప్పు 20 శాతానికి లోపే పరిమితం కావడం, రాగి, గోధుమ పిండి, జొన్నలు సరఫరా నిలిపివేయడంతో కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



జొన్నలు

20 శాతమే కందిపప్పు..

పల్నాడు జిల్లాలో 6,34,913 కార్డుదారుల్లో ఈ నెలలో కేవలం 20.52 శాతం మందికి మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 1,16,759 ప్యాకెట్లకు డీలర్ల నుంచి ఇండెంట్ రాగా శనివారం వరకు 90,178 ప్యాకెట్లు సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 4,76,553 కార్డులకు 11.43 శాతం మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నారు. డీలర్ల నుంచి 51,106 ప్యాకెట్లకు ఇండెండ్ రాగా 48,626 ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు. గుంటూరు జిల్లాలో 5,89542 కార్డుల్లో 20.95 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నారు. 1,16,673 ప్యాకెట్లకు ఇండెంట్ రాగా 1,11,403 ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు.

రేపే స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

- నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఏర్పాట్లు
- క్యాంపుల నుంచి రేపు గుంటూరుకు కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల అధికారి, ఏసీ ఓబులేసు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఓటు వేసే అభ్యర్థులకు(కార్పొరేటర్లు) మాత్రమే నగర పాలక సంస్థ కార్యాలయం, ఎన్నికల కేంద్రంలోకి అనుమతి ఉంటుందని ఓబులేసు తెలిపారు. నగర పాలక సంస్థ గుర్తింపుకార్డుతో పోలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఎన్నికల నిర్వహణకు మూడంచెల భద్రత, ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే లాలాపేట పోలీసులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సెక్రటరి పి. శ్రీనివాసరావు, ఓటర్ల గుర్తింపు అధికారి, మేనేజర్ షేక్ బాలాజీబాషా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపుల నుంచి కౌన్సిల్‌కు..

హైదరాబాద్ క్యాంపుల్లో ఉన్న ఇరు పక్షాలకు చెందిన కార్పొరేటర్లు ఆదివారం రాత్రి అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో బయల్దేరనున్నారు. సోమవారం వారంతా నేరుగా నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌కు రానున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఓటింగ్ పాల్గొననున్నారు. శనివారం చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చిన కూటమి, వైసీపీ కార్పొరేటర్లు ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఆప్యాయంగా మాట్లాడుకుని వారంతా ఆలింగనం చేసుకున్నట్లు తెలిసింది. కూటమి కార్పొరేటర్లు శనివారం రామోజీ ఫిలిం సిటీలో గడపగా, వైసీపీ కార్పొరేటర్లు ఆలయాలను దర్శించారు.



ఎన్నిక ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి ఓబులేసు

ఆన్‌లైన్‌లో 11 లక్షల 70 వేల రూపాయల మోసం 8

బీఈడీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

8 మంది సచివాలయ కార్యదర్శులకు నోటీసులు 10

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం

ప్రాంగణ ఎంపికలో ఏడుగురికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎస్‌బీసీ టెక్నాలజీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆర్వీఆర్అండ్‌జేసీ కళాశాలలోని ఏడుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా తమ కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటూ సాంకేతిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. బహుళ అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు సులభతరంగా పొందుతున్నారని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాల కృష్ణ తెలిపారు. సీఎస్‌సీ విభాగం నుంచి జి.రూప గాయత్రి, కె.సాయి సింధు, పి.వసుధ, వి.ఆశ్రిత త్రివేణి, డేటా సైన్స్ విభాగం నుంచి బి.నీరజాక్షి, కె.విజయ జేరుష, ఐటీ విభాగం నుంచి జి.అలేఖ్య తదితరులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు తెలిపారు. ఎంపికైన వారిని అభినందించారు.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి

- టొబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు
- విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన బాల మహోత్సవ్2కే25



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు, డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే అలవాటును పెంచుకోవాలని గుంటూరులోని టొబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్ శనివారం అంగరంగ వైభవంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరులోని టొబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలతో మెలగాలన్నారు. విద్యార్థులు ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగా ఉండాలన్నారు. సానుకూలంగా ఆలోచిస్తూ వీలైనంత వరకు పక్క వాళ్లతో సంతోషంగా గడపడానికి ప్రయత్నించాలన్నారు. ఏ రంగంలో ఇష్టం ఉంటే ఆ రంగంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఎమోషనల్‌గానూ, మెంటల్‌గాను ధృడంగా ఉండాలన్నారు. లక్ష్యం ఉండాలని, దాని సాధించేంత వరకు అవిశ్రాంతంగా కష్టపడాలన్నారు. రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, లారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

ఈగల్ ఎస్పీగా కమాండెంట్ నగేష్‌బాబు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏపీలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ఆర్గనైజేషన్ ఎస్పీగా కె.నగేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న నగేష్‌బాబు ఇకపై ఈగల్ ఎస్పీగా కూడా విధులు నిర్వర్తించనున్నారు. ఏపీ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈగల్ ఎస్పీగా నియమితులైన నగేష్‌బాబుకు ఏపీఎస్పీ అదనపు కమాండెంట్ డి.అశీర్వాదం, ఇతర అధికారులు, అభినందనలు తెలియజేశారు.

బీఈడీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సు మొదటి సెమిస్టర్‌కు సంబంధించి రీవాల్యూయేషన్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. ఈ పరీక్షలకు 1350 మంది హాజరవ్వగా 900 మంది బెనిఫిట్ పొందారని ఆయన తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపరినట్లు నీఈ వివరించారు.

పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సులకు సంబంధించి 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, వైవా పరీక్షలకు సంబంధించిన ఫీజు షెడ్యూల్‌ను శనివారం పరీక్షల నియంత్రణ అధికారి ఏ. శివప్రసాదరావు విడుదల చేశారు. విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఫీజు చెల్లించాలని రూ.100 అపరాధంతో ఈనెల 28వ తేదీలోగా చెల్లించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 6వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులు (వై 22 బ్యాచ్) అలాగే సప్లిమెంటరీ (వై 20 అండ్ వై 21 బ్యాచ్) విద్యార్థులు ఫీజు చెల్లించుకోవచ్చునని తెలిపారు. బీఎస్సీ, బీకాం, బీఏ, బీసీఏ, బీఏఎల్, బీహెచ్ ఎం, బీబీఎం, బీబీఎం (హానర్స్) బీఎస్సీ (ఏఎస్ఎల్‌పీ), బీఎస్సీ (హెచ్ ఎస్) కోర్సుల విద్యార్థులు ఈ పరీక్షలకు ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలు మార్చి నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో రూ.11.70 లక్షలు దోపిడీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ వద్ద నుంచి రూ. 11.70 లక్షలు దోచేసిన సంఘటన శనివారం పట్టణంలోని పెద్ద చెరువులో చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ హైమారావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పెద్ద చెరువుకు చెందిన సత్యశ్రీకి శనివారం మధ్యాహ్నం ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబాయి నుంచి మాట్లాడుతున్నామనీ, సత్యశ్రీకి ఓ పార్సిల్ వచ్చిందనీ, అందులో మాదకద్రవ్యాలు, ఆయుధాలు ఉన్నాయని ఆమెను బెదిరించారు. ఈ అంశాలపై సత్యశ్రీపై కేసు నమోదు చేయబోతున్నారు. కేసులు లేకుండా చేసుకోవాలంటే రూ.11.70 లక్షలు చెల్లించాలని బెదిరించారు. భయాందోళనలకు గురైన సత్యశ్రీ తన వద్ద అంత నగదు లేదని తెలుపగా, వారే లోన్ యాప్‌లో రూ. 11.70 లక్షలు లోన్ ఇప్పించి, ఆమె నుంచి తమకు ట్రాన్స్ఫర్ చేయించుకున్నారు.

ఆకలి సూచీలో 106వ స్థానంలో భారత్

- రైతుల ఆత్మహత్యలు.. ఆకలిచావులను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం: ఎంఏ బేబి
- కేంద్రం హోదా ఇస్తే.. పరిశ్రమలు అవే వస్తాయి: వీఎస్ఆర్
- నెల్లూరులో ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలోని 127 దేశాల్లో ఆకలి సూచికలో భారతదేశం 106వ స్థానంలో ఉంది. కడుపు నిండా తిండి పెట్టలేని పరిస్థితి దేశంలో ఉంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి వెల్లడించారు. ఆపార్టీ 27వ రాష్ట్ర మహాసభలు శనివారం నెల్లూరులో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ సభలు జరిగే అనిల్ గార్డెన్స్‌కు సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి మాట్లాడుతూ... 'దేశంలో ఆకలి కేకలు వినిపిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఆర్థికవేత్తలు ఎన్ని సూచనలు చేసినా కేంద్రం తగిన విధంగా స్పందించకపోవటంతో గిరిజనులు, వెనుకబడిన వర్గాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో 1,00,474 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి 24 గంటలకు 34 మంది రైతులు, కూలీలు ఆత్మహత్య చేసుకుంటుంటే బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పూర్తిగా ముస్లింలు ఉన్న నియోజకవర్గాల్లో బీజేపీ గెలవడానికి కారణం... కొన్ని ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లను ఓట్లు వేయకుండా భయపెట్టింది. మరికొన్ని చోట్ల భయపెట్టి ఓట్లు వేయించుకుంది. వామపక్ష నేతలు అధికారంలో ఉన్న దేశాల్లో ఎన్నో సంస్కరణలు జరుగుతున్నాయి. ఆయా దేశాలను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది' అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... 'బీజేపీ, మతతత్వాన్ని రెచ్చగొట్టి మతాల మధ్య చిచ్చు పెడుతోంది. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఏపీకి ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్ల నిధులు ఇచ్చినట్లు ప్రకటించారు. ఆ నిధులు ఏమయ్యాయో సీఎం చంద్రబాబు స్పష్టం చేయాలి. ఈ నిధులే వచ్చి ఉంటే రాష్ట్రంలో టీడీపీ ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు రూ.20 వేలు ఇవ్వవచ్చు కదా? అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ కూడా అమలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'దావోస్ వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిసి పరిశ్రమలు తెవడానికి కృషి చేస్తున్నట్లు చంద్రబాబు చెబుతున్నారు. అదే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే పరిశ్రమలు వాటంతట అవే వస్తాయన్న విషయాన్ని ఆయన గుర్తించాలి. ప్రత్యేక హోదాపై ఒత్తిడి చేయాలి' అని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, పుణ్యవతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబి, బీవీ రాఘవులు, ఆ పార్టీ నేతలు వి.శ్రీనివాసరావు, గఫూర్, మధు, బాబూరావు

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న జరిగే సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆరోజు సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కే పాండునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుగాలీ ప్రజల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ అని పేర్కొన్నారు. హర్యానా ,గుజరాత్ రాష్ట్రాల్లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి మహర్షి, కనకదాసు, వడ్డే ఓబన్నల జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విధంగానే ఈ జయంతిని కూడా నిర్వహించాలని కోరారు.


ఎమ్మెల్సీ షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉర్దూ ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఉర్దూ పాఠశాలలను తెలుగు మాధ్యమంలో విలీనం తగదు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):ఉర్దూ మాధ్యమ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను మోడల్ తెలుగు మాధ్యమ పాఠశాలల్లో విలీనం చేయడం తగదని మైనార్టీ టీచర్ అసోసియేషన్ నాయకులు మహ్మద్ ఇర్ఫాన్, జైగం అబ్బాస్, మహ్మమద్ ఇర్ఫానుల్లా, అబ్దుల్ లతీఫ్, మీర్జా కరమామత్ ఆలీ తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ప్రభుత్వ మైనార్టీ సలహాదారు, ఎమ్మెల్సీ అహ్మద్ షరీఫ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు.. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చిస్తానని షరీఫ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ఉర్దూ మధ్యమ పాఠశాలను తెలుగు మోడల్స్ పాఠశాలల్లో విలీనం చేయడం లేదని, అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

అలిమ్‌కో క్యాంపులు వాయిదా

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కోసం నిర్వహించే ఏడీఐపీ (విభిన్న ప్రతిభవంతులకు పరికరాలు కొనుగోలు పథకం), ఆర్‌వీవై(రాష్ట్రీయ వయో శ్రీయోజన) క్యాంపులు వాయిదా వేస్తున్నట్లు విభిన్న ప్రతిభాంతులశాఖ ఏడీ సువార్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీఫియల్ లింబ్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ (అలిమ్‌కో) ద్వారా ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించాల్సి ఉందని, అనివార్యకారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపులు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

● తులసీ గ్రూప్ ఎండీ తులసీ యోగీష్‌చంద్ర



గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు', ' కోపా - వినన్నపేట' వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 268 మంది పేద విద్యార్థులకు రూ. 8 లక్షల 88 వేల ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నట్లు తులసీ గ్రూప్ మేనే జింగ్ డైరక్టర్ తులసీ యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ. 4 లక్షల రూ. 30 వేలు తులసీ సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా 130 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఎన్‌టీఆర్ జిల్లా వినన్నపేటలోని డిగ్రీ కళాశాలలో ఆదివారం మధ్యా హ్నం ప్రారంభమవుతుందన్నారు. తులసీ గ్రూప్స్ చైర్మన్‌తులసీ రామ చంద్ర ప్రభు ముఖ్యఅతిథిగా హాజరై ఉపకారవేతనాలను పంపిణీ చేస్తారన్నారు.


వితరణ చేసిన కుర్చీలలో కూర్చున్న బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు

సీజీజీబీ చైర్మన్ ఆధ్వర్యంలో కుర్చీల వితరణ

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) చైర్మన్ కే ప్రమోద్ కుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కార్యక్రమాలు దృష్ట్యా భక్తులు కూర్చునేందుకు వీలుగా బ్యాంకు తరపున 100 కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో జరిగే ధార్మిక కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడిపేందుకు దోహదపడతాయన్నారు. ధార్మిక కార్యక్రమాల నిమిత్తం వచ్చే భక్తులు కూర్చు నేందుకు కుర్చీలు ఉపయోగపడతాయన్నారు. ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ సీహెచ్ మస్తానయ్య మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అంటే సర్వీస్‌కి పెట్టింది పేరు అని బ్యాంకు సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సెక్రెటరీ బి ఉమామహేశ్వర, జాయింట్ సెక్రెటరీ వీ నాగేశ్వరరావు, బ్యాంకు తరపున ప్లానింగ్ డిపార్టుమెంట్ హెడ్ ఎన్ నరేంద్ర, కృష్ణనగర్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కే ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

జేకేసీ కళాశాలలో యోగా దినోత్సవం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో శనివారం ఐదు రోజుల పాటు జరిగే యోగా దినోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. యోగాతో అనేక ఉపయోగాలు ఉంటాయని, మానసిక వికాసం పెంపొందుతుందని స్వామి రితిదేవ్‌మహరాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల క్రికెట్ గ్రౌండ్‌లో యోగా సనాలు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీ గోపిచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకురాలు నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న రితి దేవ్ మహరాజ్


కేవీ శివారెడ్డి, ఏ విద్యాసాగర్‌లను సత్కరిస్తున్న ఏపీఎన్జీవో జిల్లా సంఘ సభ్యులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలత

● ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీశివారెడ్డి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా ఏపీఎన్జీవో హోమ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారని తెలిపారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఏ విద్యాసాగర్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ నియామకం, డీఏలు, జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు ఇతర సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లామని, దశల వారీగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు చెప్పారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర నాయకులను జిల్లా ఎపీఎన్జీవో సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు దస్తగిరి రెడ్డి, రమణ, షరీఫ్, జగదీశ్వరరావు, రంగారావు, రంజిత్‌నాయుడు, సత్యనారాయణరెడ్డి, పెంచలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగుల ఆకలి కేకలు!

● రెండు గంటలు ఆలస్యంగా అల్పాహారం పంపిణీ
● మద్యం మత్తులో డైట్ సూపర్‌వైజర్
● విధుల నుంచి తొలగించినట్లు కాంట్రాక్టర్ వెల్లడి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రోగులకు శనివారం అల్పాహారం పంపిణీ సుమారు రెండు గంటలపాటు ఆలస్యమైంది. ఉదయం 8 గంటలకు జరగాల్సిన అల్పాహారం పంపిణీ పది గంటలకు ప్రారంభించారు. దీంతో, రోగులు ఆహారం అందక ఇబ్బంది పడ్డారు. ఇందుకు కారణం డైట్ సెక్షన్‌కు చెందిన ట్రాలీ సూపర్‌వైజర్ మద్యం సేవించి మత్తులో తూగడమే. ఉదయం డైట్ సెక్షన్ నుంచి ట్రాలీలో అల్పాహారం పంపిణీ ప్రారం భించారు. రెండు పెద్ద పాత్రల్లో ఆహారం సిద్ధం చేశారు. డైట్ సెక్షన్ ట్రాలీ సూపర్‌వైజర్ నరేంద్ర పూటుగా మద్యం తాగి ఆలస్యంగా విధు లకు వచ్చారు. పర్యవేక్షణ కొరవడంతో.. ఒక పాత్రలో ఆహారం పూర్త య్యాక, రెండో పాత్రను తీసుకొచ్చే వారు ఎవరూ లేకుండా పోయారు. దీంతో, అల్పాహారం కోసం వచ్చిన సుమారు 200 మంది రోగుల సంబంధీకులు గంట పాటు క్యూలో వేచి ఉన్నారు. ఈ విషయం ఎవరో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఆసుపత్రి అధికారుల వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. దీంతో, రంగంలోకి దిగిన ఆసుపత్రి అధికారులు ఈ విషయమై విచారణ జరిపారు. సంబంధిత సూపర్‌వైజర్ మద్యం మత్తులో ఉండటం వల్లే అల్పాహారం పంపిణీ మధ్యలో నిలిచిపోయినట్లు తెలుసుకున్నారు. అనంతరం కాంట్రాక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో కొంచెం సేపటి తర్వాత అల్పాహారం పంపిణీ పూర్తి చేశారు. వాస్తవానికి జీజీహెచ్‌లో రోగులకు పంపిణీ చేసే ఆహారం పర్యవేక్షించేందుకు చీఫ్ డైటీషియన్‌తో సహా మొత్తం ముగ్గురు డైటీషియన్లు ఉన్నారు. గంట పాటు రోగులకు ఆహారం అందకపోయినా, వీరు పర్యవేక్షించకుండా ఏం చేస్తున్నారనేది ప్రశ్నగా మారింది. వాట్సప్ వీడియోను గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూడా పంపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మద్యం సేవించి డ్యూటీకి వచ్చిన డైట్ సూపర్‌వైజర్‌ను తక్షణం విధుల నుంచి తొలగించినట్లు డైట్ కాంట్రాక్టర్ లిఖితపూర్వంగా జీజీహెచ్ అధికారులకు తెలిపారు.


అల్పాహారం కోసం క్యూలో వేచి ఉన్న రోగుల బంధువులు

కూటమి, వైసీపీ కార్పొరేటర్లు

ఆలింగనాలు .. పలకరింపులు !

● విహారయాత్రలో బిజీబిజీగా
● చిలుకూరు బాలాజీ గుడి వద్ద ఎదురుపడ్డ వైనం
● 3న స్టాండింగ్ కమిటీ ఎన్నిక
● ఆ రోజు ఉదయానికి గుంటూరుకు రాక

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో కూటమి, వైసీపీ కార్పొరేటర్లు క్యాంపులకు తరలివెళ్లిన విషయం తెలిసిందే. కార్పొరేటర్లు అంతా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. హైదరాబాదు లోని చిలుకూరు బాలాజీ ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం నాడు వెళ్లిన కూటమి, వెసీపీ కార్పొరేటర్లు వెళ్లారు. ఆలయ ప్రాంగ ణంలో వారు ఎదురుపడటంతో పరస్పరం ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా మాట్లాడుకున్నట్లు తెలిసింది. నిన్నామొన్నటి వరకు వీళ్లందరూ గుంటూరులో ఉన్నారు. కానీ, ఈ నెల 3న జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికలను కూటమి, వైసీపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి, వైసీపీ కార్పొరేటర్లు ప్రత్యేక క్యాంపులకు తరలి వెళ్లారు. హైదరాబాద్ శివారులో ఉన్న ఈ రెండు గ్రూపుల వాళ్లు ఆలయాలకు, విహార యాత్రలకు తిరుగుతున్నారు. కూటమి కార్పొరేటర్లు శనివారం రామోజీ ఫిలిం సిటీలో గడిపారు. ఫిలిం సిటీని సందర్శించారు. వైసీపీ కార్పొరేటర్లు సమీపంలోని ప్రాంతాలను, ఆలయాలను దర్శించారు. ఇన్ని రోజులు క్యాంపులలో ఉండి విహారయాత్ర చేస్తున్న కూటమి, వైసీపీ కార్పొ రేటర్లు సోమవారం ఉదయం గుంటూరుకు రానున్నారు. ఆదివారం రాత్రికి ప్రత్యేక వాహనాల్లో వారు బయలుదేరి ఇక్కడికి రానున్నట్లు సమాచారం. నేరుగా నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పాల్గొననున్నారు. రెండు వర్గాలు కూడా రేపు ఉదయం గుంటూరు రానున్నాయి.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ రేణుక

విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

● డీఈఓ సీవీ రేణుక

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో వారిలో దాగి వున్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అధికారి సీవీ రేణుక సూచించారు. హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల స్థాయి విద్యారినీ విద్యార్థులకు 'క్రాఫ్టర్స్'పేరుతో క్విజ్, నృత్యం, అనుకరణ, చేతిరాత, సింగింగ్, క్రాఫ్ట్, క్రియేటివ్, కన్య, నేచురల్ వంటి 14 అంశాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను డీఈవో అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ గెలుపోటములతో సంబంధం లేకుండా ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని ఆమె అన్నారు. కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రధాని మోడీ 'ఫ్యూచర్ ఇండియా వైబ్రేట్ ఇండియా' నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను భావి భారత మెరుగైన పౌరులుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'క్రాఫ్టర్స్' ద్వారా జిల్లా, నగర స్థాయిలో 1500 మంది విద్యార్థులు ఆయా పోటీలలో చురుగ్గా పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కన్వీనర్లు, సుస్మిత, నాగాంజనేయులు, సందీప్‌కుమార్ పాల్గొన్నారు




మాట్లాడుతున్న డాక్టర్ సూర్యదేవర విద్యాధర

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): న్యాయవాద వృత్తిలో రాణిం చాలంటే భాషా నైపుణ్యాలతో పాటు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని జేసీ న్యాయ కళాశాల పాలకమండలి ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్ అన్నారు. జాగర్లమూడి చంద్ర మౌళి న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నాల్గవ జాతీయ స్థాయి ముట్కోర్ట్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ విస్తృత పఠనానికి గ్రంథాలయాలు తోడ్పడతాయని విద్యార్థులకు సూచించారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల వలన విద్యార్థులలో పోరాట స్ఫూర్తి అలవడుతుందన్నారు. జాయింట్ సెక్రెటరీ డాక్టర్ పీ గోపీచంద్ మాట్లాడుతూ కోవిడ్ అనంతరం నిరంతరాయంగా ముట్కోర్ట్ పోటీ లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ బాబు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ విద్యాసంస్థల నుండి 35 జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్-1954 అనే అంశంపై ఈ రెండు రోజులు పోటీలు జరుగుతాయని తెలిపారు

జీవన నైపుణ్యాలను నేర్పే విద్యా విధానం అవసరం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీవన నైపుణ్యా లను నేర్పేలా విద్యా విధానం ఉం డాలని, అది విద్యార్థుల భవి తకు బాటలు వేస్తుందని చేబ్రోలు హను మయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్(చిప్స్) ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర అన్నారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతనలో శనివారం జరిగిన వార్షికోత్సవ వేడుకలకు గౌరవఅతిథిగా ఆయన హాజరయ్యారు. విద్యాధర మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో చదువుకుంటున్న బాల కుటీర్ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్‌వీఎస్ ప్రసన్న దేవి మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో దుర్గా రఘురామ్, రావెల సాంబశివరావు, కల్యాణ్ రామ్, విజయ, చేతన మరుద్వతి, డాక్టర్ ఎండీ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాగర్లమూడి మురళీమోహన్

కళాకారులకు ప్రజలే గురువులు

● ప్రజా కళాకారుడు, సినీ నటుడు భూపాల్
● స్ఫూర్తిదాయకంగా ఏఐపీఎల్‌సీఎఫ్ సభలు


ప్రసంగిస్తున్న భూపాల్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు ప్రజలే గురువులని, మొదటగా ఆయా శ్రామిక వర్గాల నుంచే కళాకారులు ఉద్భవించారని ప్రజా కళాకారుడు, సినీ నటుడు భూపాల్ అన్నారు. స్థానిక ఎన్జీవో సమావేశ మందిరంలో అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక (ఐపీఎల్‌ఎఫ్‌సీ) సభలు రెండో రోజున కొనసాగాయి. ఐపీఎల్‌ఎఫ్‌సీ నాయకులు రమణ ప్రసాద్, శ్రీదేవి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలను చెందిన జానపద, ఆదివాసి కళాకారుల ప్రదర్శనలు జరిగాయి. భూపాల్ మాట్లాడుతూ ప్రజల మానసిక ఎదుగుదలకు సాహిత్యం, కళారూపాలు దోహదం చేస్తాయన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో సినిమాలు వెర్రితలలు వేస్తూ ప్రజల ఉన్మాదానికి గురిచేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలభారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక లాంటి సంస్థలు ప్రజలలో నిరంతర చైతన్యం రగిలించి సాహిత్య, సాంస్కృతిక, కళారూపాల, వారసత్వాన్ని కాపాడాలని కోరారు. ఉత్తరాంధ్ర బాల కళాకారులు ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు బుర్రకథ, పశ్చిమ బెంగాల్‌కి చెందిన సౌవిక్ సాంస్కృతిక చక్ర గౌతమ్ ముఖర్జీ బృందం ప్రదర్శించిన 'కెనోనా మానుష్' నాటకం, ప్రజలపై సోషల్ మీడియా ప్రభావంపై ఒంగోలు బాల కళాకారులు ప్రదర్శించిన స్కిట్, జార్ఖండ్ ప్రజా కళాకారులు సంజయ్‌రాయ్ మైథిలి 'మానవ సంకల్పం' అనే అంశంపై ప్రదర్శించిన నృత్యరూపకం, శ్రీకాకుళం జిల్లా ప్రజా కళాకారులు ప్రదర్శించిన భగత్‌సింగ్ ఏకపాత్రాభినం, భారతీయ సమాజంపై కులవ్యవస్థ పట్టుని కళ్లకు కట్టినట్లు ప్రకాశం జిల్లా కళాకారులు ప్రదర్శించిన 'బహిష్కరణ' నాటకం, విజయవాడ ప్రజా కళాకారులు ప్రదర్శించిన 'ఎత్తిన జెండా దించకోయ్' దృశ్యరూపకం, కొమ్ము నృత్యాలు, సామాజిక చైతన్యాన్ని నింపే గజల్ పాటలు, వేణుగానం వంటివి ప్రేక్షకులను ఆలోచింపచేశాయి. కార్యక్రమంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు దివి కుమార్, కార్యదర్శి డాక్టర్ బి. అరుణ తదితరులు పాల్గొన్నారు


గౌతమ్ ముఖర్జీ బృందం ప్రదర్శిస్తున్న కెనో నమానుష్ నాటకంలో ఓ సన్నివేశం


సామాజిక చైతన్యాని నింపే పాటలను ప్రదర్శిస్తున్న కళాకారులు

8 మంది కార్యదర్శులకు నోటీసులు

● పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎనిమిది మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉన్నా కార్యదర్శులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో డి.స్వాతి (18), వై.ఫణి కిశోర్(27), ఎ.శ్రీనివాసరావు(115), కె.మధుకిరణ్(159), వి.సెబాస్టియన్(184), కె.స్వాతి(187), కె.రమణ అప్పల నాయుడు(187), వి.ఉషారాణి(205) ఉదయం 9 గంటల వరకు లాగిన్ కాలేదు. దీంతో వారికి నోటీసు ఇచ్చి వివరణ కోరామని ఓబులేసు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలికంగా రద్దు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు డీఆర్వో షేక్ ఖాజావలి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ మార్చి 3 వరకు కొనసాగు తుందని, అప్పటి వరకు ఈ కార్యక్రమం జరగదని స్పష్టం చేశారు. డివిజన్, మున్సి పాలిటి, మండల స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి అధికార యంత్రాగానికి సహకరించాలని కోరారు.


లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

పింఛన్‌దారుల ఇంట ఆనందం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పొద్దు పొడుపుతో అవ్వతాతల కళ్లల్లో ఆనందాల వెలుగు కనిపిస్తోం దని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా పింఛన్లు పంపిణీ చేయడంపై శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి రోజే 95 శాతానికి పైగా పింఛన్లు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉద యం ఆరు గంటలకే అవ్వతాతలు, వితంతువులు, వికలాంగుల ఇంటి తలుపుతట్టి వారి సంతోషాలను చూస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 4వేలకు పింఛన్ పెంచి ఇవ్వడమే కాకుండా ప్రతి నెలా తొలిరోజే 95 శాతానికిపైగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నిబద్ధతతో వ్యవ హరిస్తూ లబ్ధిదారులకు సమయానికి పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఆటోలకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ నంబర్ల కేటాయింపు


ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకుఅవగాహన కల్పిస్తున్న ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ నంబర్ అనేది ఆధార్ నంబర్ లాంటిదని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో నగరంలోని ఆటోలకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ నంబర్ల కేటాయింపు కార్యక్రమాన్ని శనివారం తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీస్ ఆటో నంబర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఆటో ప్రయాణికులకు,తాము ప్రయాణిస్తున్న ఆటోలకి సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులో ఉంచడం, వారు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరడానికి భరోసా కల్పించడమే ఈ ట్రాఫిక్ పోలీస్ నంబరు కేటాయింపు ముఖ్య ఉద్దేశమన్నారు. ట్రాఫిక్ పోలీస్ నంబర్ తీసుకోవాలంటే ఆటో ఓనర్, డ్రైవర్ తమ వాహనం పూర్తి వివరాలుతో పాటు తమ ఆధార్ కార్డులను, డ్రైవింగ్ లైసెన్స్ ను, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను పోలీసు వారికి అందించాల్సి ఉంటుందన్నారు.

పెమ్మసానిని విమర్శించే స్థాయి అంబటికి లేదు

● కనపర్తి శ్రీనివాసరావు



గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ని విమర్శించే స్థాయి వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుకి లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుదేశం ఎమ్మెల్యేలుగా గెలిచిన మద్దాళి గిరిధర్, వల్లభనేని వంశీ, కరణం బలరాం తది తరులను ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయించకుండా వైసీపీలో ఎలా చేర్చుకున్నారో అంబటి సమాధానం చెప్పాలన్నారు. కౌన్సిలర్‌కు తక్కువ, కార్పొరేటర్‌కు ఎక్కువైన మేయర్ మనోహర్ నాయుడిని గద్దె దింపకుండా ఆపే శక్తి జగన్మోహనరెడ్డికి కూడా లేదని సవాల్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే మేయర్ అవినీతిని తట్టుకోలేక సజ్జల దగ్గర సొంత పార్టీ కార్పొరేటర్లే పంచాయతీ పెట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు కేంద్రమంత్రికి సంబంధం ఏమిటని, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి నగర అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములవుతామని వైసీపీ కార్పొరేటర్లే స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని అన్నారు.నగరాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెమ్మసాని పెద్ద ఎత్తున తీసుకొస్తున్న నిధులను అడ్డుకోవడమే కాకుండా, పాలనా పరమైన ఇబ్బందులు సృష్టించటానికి మేయర్ కుట్ర పన్నారని ఆరోపించారు. పెమ్మసాని పేరెత్తే అర్హత జగన్‌కు లేదని, అంబటి లాంటి అవినీతి పరులకు ఆయన పేరెత్తే అర్హతే అసలు లేదని అన్నారు.

మేయర్ మనోహర్ నోరు అదుపులో పెట్టుకోవాలి

● వద్రాణం హరిబాబు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు హెచ్చరించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరుకి మనోహర్ లాంటి విలువలులేని వ్యక్తి మేయర్ కావడం నగర ప్రజల దురదృష్టమని అన్నారు. పోలీసుల చేతిలో నుంచి లాఠీ లాక్కొని ఓ వీధి రౌడీ లాగా టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డ మేయర్ కావటి, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా నీతి మాటలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. గత వైసీపీ హయాంలో గుంటూరులో ఎటువంటి అభివృద్ధి సాధించారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేసి కొనుగోలు చేశారని, తెలుగుదేశం పార్టీకి అటువంటి సంస్కృతి లేదన్నారు. ఆరోజున మద్దాలి గిరిధర్, కరణం బలరాం, పోతుల సునీతలను ఏ అవసరం ఉండి కొన్నారని ప్రశ్నించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చేస్తున్న అభివృద్ధిని చూసి, పారదర్శకమైన ప్రజా పాలనను చూస్తున్న వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు ఎన్నోసార్లు పెమ్మసాని సమక్షంలో టీడీపీ లోకి రావాలని ప్రయత్నించారన్నారు. పెమ్మసాని ఆరోజునే గేట్లు ఎత్తివేస్తే కార్పొరేటర్లు ఒక్కరు కూడా వైసీపీలో ఉండేవారు కాదన్నారు. ఈరోజున వైసీపీకి ఇలా మాట్లాడే పరిస్థితి ఉండేది కాదన్నారు. మేయర్ కావటి గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేయకపోగా, నేడు నగరం అభివృద్ధి పథంలో దూసుకు పోతుంటే, కౌన్సి ల్‌లో ప్రతి అభివృద్ధి పనికీ అడ్డుపడుతున్నారని ఆరోపించారు.వైసీపీ అఘా యిత్యాలు, రౌడీ రాజకీయాలు తెలిసి, దాడులకు పాల్పడతారని ముందే గ్రహించిన కార్పొరేటర్లు భయపడి వారే స్వచ్ఛందంగా అజ్ఞాతంలోకి వెళ్లారన్నారు. సమావేశంలో బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు అన్యాయం

మంగళగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఏటా రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. 45 లక్షల గ్రామీణ కుటుంబాలు ఆధారపడిన చేనేత రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వం నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

తొంభైశాతం పంపిణీ పూర్తి

● మిగిలిన వారికి రేపు అందజేత

తుళ్లూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో తొంభైశాతం సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం అధికారులు పూర్తి చేశారు. ఒకటో తారీఖునే అందజేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా చెప్పినట్టు తెల్లారేసరికి ఇంటి ముంగిటకు వచ్చి వీఆర్వో, వెలుగు, పంచాయతీ, గ్రామ సచివాలయం సిబ్బంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఉదయం ఆరు గంటలకు పింఛన్లు ఇచ్చే కార్యక్రమం మొదలుపెట్టారు కూటమి నాయకులు దగ్గరుండి పింఛన్ల పంపిణీ చేయించారు. ఉపాధి కోసం బయటకు వెళ్లిన వారు అందుబాటులో లేని వారికి సోమవారం పంపిణీ చేస్తారని ఎంపీడీవో శిల్ప తెలిపారు. ఇంటి వద్ద ఉండాలని కోరారు.

విజయకీలాద్రిపై నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణపరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చినజీయర్ స్వామి ఆశ్రమ నిర్వహకులు పురాణం వెంకటాచార్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. త్రిదండి చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీదత్త పీఠం వార్షికోత్సవాలు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాబాద్‌లో గల శ్రీదత్త పీఠం వార్షికోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరపనున్నట్టు దత్త ఉపాసకులు జయశంకర్ శనివారం తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీన మహాచండి హవనం, సాయంత్రం 7గంటలకు రుద్రాభిషేకం, 3న గ్రామోత్సవం, సుదర్శన హవనం, 4న దత్తాత్రేయ హవనం, అన్న ప్రసాద వితరణలు జరుగుతాయని, భక్తులు పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

రైతులకు రుణాలిచ్చి ఆదుకోవాలి

పెదనందిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : రైతులకు రబీ పంటలకు రుణాలు ఇవ్వాలని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కొల్లా సీతారామయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రబీ సీజన్ నుంచి వాణిజ్య పంటలకు వేసేందుకు రుణాల కోసం కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వస్తుందని ప్రత్యేక అధికారి లేకపోవడం వల్ల రుణాలు మంజూరు చేయలేదని దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు కూడా ఫ్యాక్స్ ద్వారా దరఖాస్తును పంపించినట్లు చెప్పారు. రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలిపారు.

టాటా ఏస్ వాహనం బోల్తా..

ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

పెదనందిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : పెదనందిపాడు బాపట్ల రోడ్డులో నాగులపాడు వద్ద టాటా ఏస్ వాహనం బోల్తాపడటంతో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కొమ్మూరు నుంచి పెదనందిపాడు వచ్చే టాటా ఏస్ వాహనం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో సాగర్ కాలువ సమీపంలో టాటా ఏస్ బోల్తా పడింది. వాహనంలో ఉన్న నలుగురు కూలీలు వినయ్, చోటూ, బీహార్‌కుమార్, సంతోష్‌లు కింద పడిపోయారు. వినయ్(26) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వారిలో బీహారీకుమార్ పరిస్థితి విషమంగా ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించగా ఎస్ఐ మధుపవన్ జరిగిన వివరాల గురించి వెల్లడించారు.

కాకుమానులో చైన్ స్నాచింగ్

కాకుమాను, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నెల రోజులుగా అద్దెకు ఉంటూ ఉన్న వ్యక్తే మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన ఘటన కాకుమానులో జరిగింది. ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిలివేరు ప్రమీల ఇంట్లో నెల కిందట ఉపేంద్ర అనే వ్యక్తి అద్దెకు వచ్చాడు. శనివారం రాత్రి సమయంలో ప్రమీల ఇంటి బయట ఉన్న సమయంలో ఉపేంద్ర ఆమెతో మాట్లాడుతూ మెడలోని రెండున్నర సవర్ల గొలుసు లాక్కొని ఉడాయించాడు. ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏకనాథ్ తెలిపారు.

శారీరక, మానసిక శ్రేయస్సుకు యోగా

● గురువు ప్రబరి స్వామి రిత్దేవ్

తాడికొండ(లాం)ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక శ్రేయస్సు కోసం క్రమం తప్పకుండా ప్రతి రోజు యోగా చేయాలని పతంజలి యోగా పీట్ కేంద్రీయ యోగ గురువు ప్రబరి స్వామి రిత్దేవ్ తెలిపారు. శనివారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో యోగా ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిద్వారాలో పతంజలి యోగాపీట్ కేంద్రీయాలయం నుంచి వచ్చిన యోగా గురువు ప్రబరి స్వామి రిత్దేవ్ యోగా చేసి చూపించారు.

రైతుల ఫిర్యాదులను సంతృప్తికరంగా పరిష్కరించాలి

● రాజధాని ప్రాంతంలో పర్యటించిన సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు
● డీసీలు, సామాజిక అభివృద్ధి విభాగ అధికారులతో సమీక్ష


ఇంజనీరింగ్, సోషల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సీఆర్డీఏ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కన్నబాబు శనివారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించారు. ప్రభుత్వ కాంప్లెక్స్ ఐదు టవర్ల పునాదుల్లో నీరు తోడుతున్న పనులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. పక్కన ఉన్న హైకోర్టు పునాదులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉద్యోగుల ఇళ్ల టవర్లను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న జడ్జీల బంగళాను ఆయన పరిశీలించారు. అనంతరం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో డిప్యూటీ కలెకర్లు, సోషల్ వెల్ఫేర్ అధికారులతో సమావేశం అయ్యారు. తొలుత సీఆర్డీఏలోని అన్ని యూనిట్ల పరిధిలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లతో ఉదయం పెనుమాక యూనిట్ ఆఫీసులో సమావేశం అయ్యారు. రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనులు రైతు సమస్యలు, భూసేకరణ వంటి అంశాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజధాని నిర్మాణ పనుల్లో ఎక్కడా అలసత్వం ఉండకూడదని అన్నారు. అధికారులు వీలైనంత వేగంగా, పారదర్శకంగా పని చేయాలని కోరారు. ల్యాండు పూలింగ్‌లో ఇంకా భూములు ఇవ్వని రైతులతో మాట్లాడి వారి అనుమానాలు నివృత్తి చేసి సానుకూలంగా స్పందించేలా చూడాలని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు.

సీఆర్డీఏ ప్రాజెక్టు పనుల పరిశీలన

లింగాయపాలెం రెవెన్యూ పరిధిలోని సీడ్ రోడ్డు పక్కన ప్రభుత్వ మొదటి ప్రాధాన్య కట్టడమైన సీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీసులను పరిశీలించా రు. ఆఫీసు డిజైన్, పురోగతి పనుల గురించి సీఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్ బిల్డింగ్ నిర్మాణాలు పరిశీలించారు. ప్రభుత్వ ఐకానిక్ టవర్ల దగ్గర జరిగిన డీ వాటరింగ్ పనులు ఆయన పరిశీలించారు. ప్రభుత్వం గడువు నిర్ణయించిన ప్రకారం పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ఇంజనీరింగ్ - ఇన్ - చీఫ్ గోపాలకృష్ణారెడ్డి, హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ జీవీ పల్లంరాజు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగం చీఫ్ ఇంజనీర్ సీహెచ్ ధనుంజయ్ పాల్గొన్నారు.

కార్మిక క్షేమం ముఖ్యం..

రాజధాని ప్రాంతంలో ప్రముఖ కట్టడాల పరిశీలన తరువాత కన్నబాబు తుళ్లూరు ప్రాంతీయ కార్యాలయంలో సామాజిక అభివృద్ధి విభాగం అధికారులతో సమావేశమయ్యారు. రాజధాని రైతులకు అందాల్సిన కౌలు, భూమిలేని పేదలకు అందుతున్న పింఛన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలో నిరుద్యోగ యువతలో పెంపొందించాల్సిన నైపుణ్యాల గురించి కూలంకుషంగా చర్చించారు. భవిష్యత్‌లో రాబోయే అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయా రంగాలకు తగ్గట్టు యువత వివిధ అంశాల్లో నైపుణ్యాలు కల్పించాలని సూచించారు. అలాగే రాజధానిలో జరుగుతున్న కట్టడాల పనుల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది వలస కార్మికులు వస్తారని వారి నివాసం, సంక్షేమానికి సంబంధించిన చర్యలు పటిష్టంగా ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రూప్ డైరెక్టర్ కృష్ణమోహన్, సీఈ శ్రీనివాస్ యాదవ్, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు సాయిబాబా మందిర వార్షికోత్సవం

● హాజరుకానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
● ఇతర జిల్లాల నుంచి కూడా రానున్న భక్తులు
● అందరికీ భోజన ఏర్పాట్లు


వార్షికోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పాతూరి నాగభూషణం


బాబా దివ్యమంగళ స్వరూపం

మంగళగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరం 19వ వార్షిక వేడుకలకు ముస్తాబవుతోంది. ఈ నెల 3వ తేదీన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అనతి కాలంలోనే అందరి దృష్టిని ఆకర్షించి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతూ విశేష ప్రాచుర్యాన్ని గడించిన ఆలయాల్లో పెదవడ్లపూడి గ్రామంలోని శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరం అగ్రభాగంలో నిలుస్తుంది. ఈ మందిర అభివృద్ధి కోసం పాతూరి నాగభూషణం విశేష కృషి జరిపి మందిరాన్ని చూడచక్కని రీతిలో భక్తులను ఆకర్షించే విధంగా రూపకల్పన చేశారు. ఈ ఆలయంలో బాబా వారి దివ్య మంగళ విగ్రహం భక్తులను తన్మయ పరుస్తుంది. ఏదో తెలియని అనుభూతి, మానసిక ప్రశాంతతను చేకూరుస్తున్నట్టు ఆధ్యాత్మిక వాతావరణంలో అభయ హస్తమిస్తూ బాబా వారి విగ్రహం నేత్రానందంగా దర్శనమిస్తుంది. ఈ విగ్రహాన్ని జైపూర్ నుంచి నిపుణులైన శిల్పులతో చాలా చక్కగా చేయించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లాలోని అనేక మంది భక్తులు ఈ బాబా మందిరాన్ని దర్శించుకుంటూ ఉంటారు. రాజకీయ నేతలు, ఉన్నత ఉద్యోగులు, ఎన్నారైలు ఈ బాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వుంటారు. మంగళగిరి నుంచి తెనాలి వైపు వెళ్లే ప్రతి ఒక్కరూ బాబా గుడి వద్దకు రాగానే నమస్కరించుకుంటూ ఉంటారు.

వార్షికోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహోత్సవానికి గుంటూరు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. భక్తులందరికీ అన్న ప్రసాదాలను అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 3వ తేదీ సోమవారం ఉదయం 5:30 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు పాలాభిషేకం, 8 గంటలకు బాబా వారికి అన్నాభిషేకం, ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భరతనాట్యం, కూచి పూడి, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి, సినీ కళాకారులతో హాస్యవల్లరి, మిమిక్రీ, మేజిక్ షో వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన


సర్‌ప్లస్ కోర్సు వద్ద వంతెన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న బాపట్ల డ్రెయినేజ్ డీఈ ధనలక్ష్మి, రైతులు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు, లేమల్లెపాడు గ్రామాల రెవెన్యూ పరిధిలోని రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులు, ఎదురవుతున్న సమస్యలను ఇటీవల ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన చొరవతో శనివారం బాపట్ల డివిజన్ డ్రెయినేజ్ డీఈ ధనలక్ష్మి, జేఈ స్వర్ణలతలు రైతులతో కలసి క్షేత్రస్థాయిలో వంతెనల నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించారు. వివరాల్లోకి వెళితే వట్టిచెరుకూరు గ్రామానికి చెందిన రైతులకు, లేమల్లెపాడు ఆయకట్టులో, లేమల్లెపాడు గ్రామస్థులకు వట్టిచెరుకూరు ఆయకట్టులో రెండొందల ఎకరాల మాగాణి సాగు నీటి భూములు ఉన్నాయి. ఈ రెండు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే అడ్డంకిగా జలవాగు కలిసే సర్‌ప్లస్ కోర్సు డ్రెయినేజ్ ప్రతి బంధకంగా మారింది. ఈ రెండు గ్రామాల రైతులు కూడా ఆయా భూములకు వెళ్లేందుకు నాలుగు కిలో మీటర్ల దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. 30 సంవత్సరాలుగా ఈ వంతెన నిర్మాణాలు పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల వట్టిచెరుకూరు, లేమల్లెపాడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులుకు అందజేశారు. సమస్యను పరిశీలించిన వెంటనే ఎమ్మెల్యే బాపట్ల డివిజన్‌లో ఉన్న డ్రెయినేజ్ డీఈ పద్మావతికి ఫోన్ ద్వారా విషయాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో శనివారం డ్రెయినేజ్ డీఈ పద్మావతి, జేఈ స్వర్ణలతలు రైతులతో కలసి సర్‌ప్లస్ కోర్సు జలవాగు కలిసే డ్రెయినేజ్ ప్రాంతాన్ని, అలాగే సొపాడు గ్రామం వెళ్లే మార్గంలో వంతెన వద్ద కొండవీటివాగు వంతెన కోరే స్థలాన్ని రైతులతో కలసి పరిశీలించారు. రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీఈ పద్మావతి రైతులకు హామీ ఇచ్చారు.

పొగాకు బ్యార్నీ దహనంపై కేసు నమోదు

పెదనందిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నవరంలో వినియోగంలో ఉన్న పొగాకు బ్యార్నీ అగ్ని ప్రమాదంపై శనివారం కేసు నమోదైంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామంలో నంగినేని చౌదరి బాబుకు చెందిన వినియోగంలో ఉన్న పొగాకు బ్యార్నీలో నుంచి పొగరావడంతో గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని మంటల వ్యాప్తిని గమనించి మోటార్ల సహాయంతో మంటలు అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసినప్పటికి అదుపులోకి రాకపోవడంతో చిలకలూరిపేట నుంచి అగ్నిమాపక సిబ్బంది, అధికారి మాణిక్యరావు మంటలను ఆర్పివేశారు. బ్యార్నీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నష్టం అంచనా రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి రైల్వే స్టేషన్ దగ్గర అనుమానంగా సంచరిస్తున్న ముగ్గురు అనుమానితులను శనివారం అదుపులోకి తీసుకోగా వారి నుంచి 1 కేజీ 150 గ్రాముల లభించిందని అడిషనల్ ఎస్పీ రవికుమార్ తెలిపారు. తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ మన్యం జిల్లా, పాడేరుకు చెందిన విజయకుమార్ వద్ద కొనుగోలు చేసిన తాడేపల్లికి చెందిన గాజుల హరీష్‌కుమార్ ఈ గంజాయిని ఇద్దరు మహిళలతో అమ్మడం ప్రారంభించారు. తాడేపల్లికి చెందిన నాగమణి, రోజా చిన్న చిన్న పొట్లాలతో సరఫరా చేస్తున్నారని చెప్పారు. వీరి ముగ్గురిపై క్రైమ్ నెం.45/2025 కేసు నమోదు చేశామని రిమాండ్‌కు పంపుతున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీతోపాటు డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలి

● ఎంఈవో అబ్దుల్ అలీమ్

మేడికొండూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలని ఎంఈవో అబ్దుల్ అలీమ్ సూచించారు. స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో మండలపరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు లక్షా80వేల విలువైన శానిటరీ ప్యాడ్‌లు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో హాజరయ్యాడు. పాఠశాల పూర్వ విద్యార్థిని కడియాల శిరీష అమెరికాలో స్థిర పడినా సమాజంపై సేవాభావంతో విద్యార్థినుల అవసరాలను గుర్తించి తను సభ్యురాలిగా ఉన్న స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా 180 మంది విద్యార్థినులకు శానిటరి ప్యాడ్‌లు అందించడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసు నుంచి విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తే సమాజానికి సేవచేసే గుణం కలిగి ఉంటారని అందుకు ఉదాహరణ కడియాల శిరీష అని అన్నారు. కార్యక్రమంలో మాయకుంట్ల జోసెఫ్, శిరీష తండ్రి శివప్రసాద్ తదితరులు మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉయ్యూరు శ్రీవ్యాల్‌కు కృతజ్ఞతలు తెలియ జేశారు.

ట్రాఫిక్ పోలీసులకు సేఫ్టీ జాకెట్స్


సేఫ్టీ జాకెట్లు విడుదల చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ ట్రాఫిక్ పోలీసులకు సేఫ్టీ జాకెట్లు అందజేసింది. పోలీసు శాఖ కోసం ప్రత్యేకంగా రూపొందించిన సేఫ్టీ జాకెట్స్‌ను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శనివారం ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, మణిపాల్ హాస్పిటల్ రేడియేషన్ ఆంకాలజీ కన్సల్టెంట్ డాక్టర్ రామకృష్ణ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ హెడ్ రామాంజనేయ రెడ్డిలతో కలిసి విడుదల చేశారు. అలాగే ప్రత్యేకతతో ఐక్యత అనే నినాదంతో నిర్వహించనున్న క్యాన్సర్ డే పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. వినూత్న రీతిలో క్యాన్సర్ డే నిర్వహించనున్న హాస్పిటల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భృగు వంశీకుడైన మృకండు మహర్షి పుత్రుడు శ్రీమార్కండేయ స్వామి జయంతి వేడుకలను మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీభద్రావతీ సమేత భావనారుషి స్వామి దేవాలయంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతకింది కనకయ్య, ఉపాధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, కోశాధికారి గంజి రవీంద్రనాథ్, సహాయ కార్యదర్శి రామనాథం పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాపమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

● నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్

తాడికొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి పాపమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అని తాడికొండ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 5న వైసీపీ చేపట్టిన ఫీజుపోరు పోస్టర్‌ను వైసీపీ దొంగల ముఠా అంతాకలిసి విడుదల చేశారని అనూఫ్ విమర్శించారు. గతంలో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని విద్యాదీవెనగా పేరు మార్చి కొత్త పథకం సృష్టించినట్లు ప్రచారం చేసుకున్నాడన్నారు. ఎన్నికల ముందు బటన్ నొక్కి డ్రామా ఆడి, ఫీజుల బకాయిల కుప్ప పెట్టి వెళ్లాడాన్నారు. 2014-19 టీడీపీ హయాంలో 16 లక్షల మందికి రీయంబర్స్ మెంట్ చేస్తే జగన్ కేవలం 9 లక్షల మందికి మాత్రమే విడతల వారిగా రీయింబర్స్‌మెంట్ ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం పెట్టి బకాయిల వల్ల డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ, ఇతర కోర్సులు పూర్తి చేసినా.. ఉన్నత విద్య చదివే అవకాశం లేక పలువురు ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారు. 5 ఏళ్లలో 4 విడతలు ఎగ్గొట్టి కేవలం ఫీజులకే రూ.4,271 కోట్ల బకాయిలు పెట్టింది జగన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రూ.788 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందన్నారు. 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం ప్రశాంతంగా ఉందన్నారు. జగన్ కుట్రలు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయటానికి ప్రణాళికలు వేస్తున్నారని అన్నారు.

కృష్ణానదిలో 7.20లక్షల చేప పిల్లల విడుదల


కృష్ణానదిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు

తాడేపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ప్రకాశం బ్యారేజి వద్ద సీతానగరం పడవల రేవులో సీడ్ స్టాకింగ్ కమిటీ సమక్షంలో మత్స్యశాఖ అధికారులు శనివారం 7.20లక్షల చేపపిల్లలను నదిలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) డిస్ట్రిక్టు ప్రాజెక్టు మేనేజర్ ఎ.లక్ష్మీకుమారి, గుంటూరు జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు కె.భూశంకర్ సమక్షంలో నిడుబ్రోలు క్షేత్రం నుంచి లక్ష చేపపిల్లలను, టెండర్ ద్వారా ఎంపిక చేసిన గాయత్రి ఫిష్ సీడ్ పారమ్స్ కూచిపూడి నుంచి 3.10లక్షల చేపపిల్లలు, శ్రీవీరభద్ర ఫిష్ పారమ్స్ కైకలూరు వారి నుంచి 3.10 లక్షల చేపపిల్లలను మొత్తంగా 7.20 లక్షల చేపపిల్లలను కృష్ణానదిలో విడుదల చేశారు. గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారుల సమక్షంలో చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మత్స్యసంపదను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి.గాలిదేముడు, నిడుబ్రోలు ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి ఎండీ జైనుల్లా ఖాన్, మత్స్యశాఖ సహాయ పరిశీలకులు కె.శివప్రసాద్, తహసీల్దార్ డి.సీతారామయ్య, పోలకంపాడు మత్స్య సహకారం సంఘం అధ్యక్షుడు సైకం మల్లేశ్వరరావు, సంఘ సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

8 మంది కార్యదర్శులకు నోటీసులు

● పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎనిమిది మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉన్నా కార్యదర్శులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో డి.స్వాతి (18), వై.ఫణి కిశోర్(27), ఎ.శ్రీనివాసరావు(115), కె.మధుకిరణ్(159), వి.సెబాస్టియన్ (184), కె.స్వాతి(187), కె.రమణ అప్పలనాయుడు(187), వి.ఉషారాణి(205) ఉదయం 9 గంటల వరకు లాగిన్ కాలేదు. దీంతో వారికి నోటీసు ఇచ్చి వివరణ కోరామని ఓబులేసు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళగిరి ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని ధ్వజమెత్తారు. కార్మికులందరికీ ఉద్యోగ, పని భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నందం బ్రహ్మేశ్వరరావు, కార్యదర్శి గండికోట దుర్గారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్ ఆవిష్కర్తలుగా మారాలి

● నాసా శాస్త్రవేత్త జాహ్నవి డాంగేటి

ఫిరంగిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కేవలం చదువు కోసమే కాకుండా భవిష్యత్తును నిర్మించగలిగే గొప్ప ఆవిష్కర్తలుగా మార్పు చెందాలని నాసా శాస్త్రవేత్త జాహ్నవి డాంగేటి అన్నారు. శనివారం అమీనాబాద్‌లో గల ఫీనిక్స్ గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఆర్ట్స్ అండ్ టెక్నాలజీడే సభలో ఆమె మాట్లాడారు. స్కూల్ విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు, ప్రాజెక్టులు శాస్త్ర సాంకేతిక, వినూత్న ఆలోచనలకు నిదర్శనంగా ఉన్నాయన్నారు. స్కూల్ కరస్పాండెంట్ మోజెస్ మాట్లాడుతూ చదువు ప్రపంచాన్ని మార్చగలిగే అత్యంత శక్తివంతమైన ఆయుధమని తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

ఎంఈవో సాల్మన్‌రాజు



కొల్లిపరలో పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గుణాత్మక విద్యనందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శనివారం కొల్లిపరలో ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిపై ప్రతి నెల తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిబంధనలు ప్రకారం ఆహార పదార్థాలు పిల్లలకు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

మండల పరిషత్ కార్యాలయ రికార్డుల తనిఖీ

పెదకాకాని, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం రికార్డులను జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు తనిఖీ చేశారు. శనివారం ఆయన కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి

● వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలని వైద్యాధికారి సుమంత్ అన్నారు. శనివారం మండలంలోని దావులూరులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షలు చేయించుకోవడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చన్నారు. ప్రతి నెల నిర్వహించు ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జానీబేగమ్, ఏఎన్ఎం వసుమతి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశాలు పాల్గొన్నారు.

వార్డు సమస్యలను పరిష్కరించండి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డులో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని ఆర్పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కోరారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలోని చైర్‌పర్సన్‌ను నాగరాజు కలసి తమ వార్డుసమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కొల్లిపర మండల అధ్యక్షుడు తుంగ బాలస్వామి, జిల్లా మానవహక్కుల కార్యకర్తలు రేఖ పవన్, తేజ, శ్రావణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురు బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులకు, చిన్నారులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ సీనియర్ మేనేజర్ నవజ్యోతి, గ్రామపెద్దలు బండి జగన్‌మోహన్‌రావు, చెన్నుపాటి రవీంద్ర, చిన్ని, ముక్కాముల మధుబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొని వాటిని అందజేశారు. బ్యాంకు ఆఫీసర్లు గోపి, అరవిందశాస్త్రి, రమ్య, దీప్తి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదుచేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక మారీసుపేటకు చెందిన చుక్కా గంగాభవాని (42) ఆమె భర్త విజయ్‌కుమార్ ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గంగాభవాని గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో మానసికంగా ఇబ్బందిపడుతోంది. ఈ క్రమంలో గత నెల 30న ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో చీరతో ఉరిపెట్టుకుంది. అప్పుడే ఇంటికివచ్చి తలుపుతీసి చూసిన భర్త చీరను తెంపి ఆమెను ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలి రూరల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని నందివెలుగులో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ, కొలకలూరులో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5:30 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ తోటకూర వీర వెంకటరావు ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. చెట్ల కొమ్మలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతులు చేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోమవారం గ్రీవెన్స్ రద్దు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గుంటూరు, కృష్ణా పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేయడంతో ఈ నెల 3 నుండి మార్చి 3 వరకు ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని, ఆ తదుపరి కొనసాగుతుందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి

● ఓటు వేసే విధానంపై అవగాహన పెంచండి

● ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆలపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ మంత్రి, కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో వేమూరు ఎమ్మెల్యే నక్కాఆనందబాబుతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణపై ముఖ్య నాయకులతో ఆలపాటి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ తెనాలి, వేమూరు నియోజవర్గాల్లో పట్టభద్రుల ఓట్లు గతంలో కంటే మిన్నగా నమోదయ్యాయని అందుకు నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా చేసిన అరాచకాలన్నీ భరించి తిరిగి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నామన్నారు. అదే పట్టుదలతో ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. రెండు నియోజకవర్గాల్లో ఉన్న ఎమ్మెల్సీ ఓటర్లకు పోలింగ్ బూత్‌లో అభ్యర్థులను గుర్తించే విధానాన్ని తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. గతంలో జరిగిన ఎన్నికల మాదిరి ఓటర్లు గుర్తించేలా పార్టీ గుర్తులు ఉండవని కేవలం అభ్యర్థిపేరు పక్కన పార్టీ పేరు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ నెల 7న నామినేషన్ వేసేందుకు కార్యాచరణతో ఉన్నామని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రెండు నియోజకవర్గాల నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛనన్లు పంపిణీ చేశారు. శనివారం స్థానిక చెంచుపేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెంచుపేటలో శానిటేషన్ పనుల పరిశీలన

స్థానిక చెంచుపేటలో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. డ్రైయిన్లలోని వ్యర్థాలను, రోడ్లపై చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరగలం

● సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా

తెనాలి రూరల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరగలమని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా చెప్పారు. శనివారం మండలంలోని అంగలకుదురు ముక్తి ట్రైబల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ ముమ్మనేని భానుమతి, డాక్టర్ ఉప్పాల పావని ప్రియాంకల సహకారంతో దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా పాల్గొని విద్యార్థులకు దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్లు కుర్రా శ్రీను, విజయలక్ష్మీ, కౌన్సిలర్ మానేపల్లి బుచ్చిబాబు, సూరే సాంబశివరావు, నాళ్ళం శ్రీమన్నారాయణమూర్తి, ముక్తి స్కూల్ కరస్పాండెంట్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులతో సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా తదితరులు

డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి బంగారు పతకం



డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి బంగారు పతకాన్ని అందిస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, శ్యామ్‌ప్రసాద్, నీలిమ, ప్రియాంక తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ వైద్యసేవలకుగాను ప్రవాస భారతీయుడు, సైకియాట్రిస్ట్ డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు శనివారం అందజేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో డాక్టర్ చదలవాడ కృష్ణయ్యచౌదరి స్మారక ఎండోమెంటు గోల్డు మెడల్‌ను డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి.మధు ప్రభాకర్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబు మాట్లాడుతూ ఈ మెడల్‌ను అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులకు అందించే చికిత్సలో నూతన విధానాలు, చికిత్సల గురించి వైద్యులకు అవగాహన కల్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్యామ్‌ప్రసాద్, పావనిప్రియాంక, నీలిమ, కృష్ణచైతన్య, చందు ఉదయ్‌భాస్కర్, పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చదలవాడ కృష్ణయ్యచౌదరి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శివరాత్రికి తరలివచ్చే భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. శ్రీలీలాభవానీ పద్మశాలీయ అన్నదాన సత్రం గోవాడకు చెందిన క్యాలెండర్‌ను శనివారం తెనాలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లగా భక్తుల కోసం అన్నదానం చేస్తున్నారని, ఐక్యమత్యంగా కమిటీ సభ్యులు ఈ కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. దాతల సహకారంతో ప్రతి ఏటా పదివేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ అధ్యక్షుడు మాచర్ల నాగరాజు, కార్యదర్శి కోటేశ్వరరావు, సభ్యులు శివప్రసాద్, వెంగళరావు, శివకుమార్, అప్పారావు, బాబు, చంటి, మణి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు మృతి బాధాకరం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి శ్రీనివాసరావు మృతి బాధాకరమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని కొలకలూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నీటి సంఘాల మాజీ చైర్మన్ తాళ్లూరి శ్రీనివాసరావు శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలపాటి గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

● మంత్రి నాదెండ్ల మనోహర్, శ్రీనివాసరావు మృతి పట్ల ఓ ప్రకటన ద్వారా సంతాపం వ్యక్త పరిచారు. శ్రీనివాసరావు మంచి నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారని, ఆయన మృతి బాధాకరమన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాడసానుభూతిని తెలుపుతూ ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని పేర్కొన్నారు. పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 1 : పొన్నూరు పట్టణంలోని వేంచేసివున్న వీరాంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్రమును పురస్కరించుకొని స్వామి వారి మూలవిరాట్‌కు సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త దంపతుల చేత సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి గద్దె అమర్నాథ్ పర్యవేక్షించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి1: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిలీప్ శనివారం ఆరోపించారు. ప్రత్యేక హోదా విభజన హామీలు అమలులో రాష్ట్రానికి వరుసగా 11వ సారి అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించుకోవడంలో కూటమి నాయకులు ఘోరంగా విఫలమైయారని ఆరోపించారు. రాష్ట్ర ఎంపీలు ప్రధాని మోదీని ఆకట్టుకునే ప్రయత్నంలో పెడుతున్న శ్రద్ధ రాష్ట్ర ప్రయోజనాలపై పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. నిధులు కేటాయింపులో బీజేపీ వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరి రాష్ట్ర భవిష్యత్తును అంధకారమయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైకుంఠపురం ఆలయంలో భక్తుల సందడి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో శనివారం భక్తులు కిటకిటలాడారు. మాఘమాసం ప్రారంభం శనివారం కావడంతో పవిత్రమైన రోజుగా భావించి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈవో అనుపమ, అర్చక సిబ్బంది పర్యవేక్షించారు.



వైకుంఠపురం ఆలయంలో బారులు తీరిన భక్తులు

8 మంది కార్యదర్శులకు నోటీసులు

● పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎనిమిది మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉన్నా కార్యదర్శులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో డి.స్వాతి (18), వై.ఫణి కిశోర్(27), ఎ.శ్రీనివాసరావు(115), కె.మధుకిరణ్(159), వి.సెబాస్టియన్ (184), కె.స్వాతి(187), కె.రమణ అప్పల నాయుడు(187), వి.ఉషారాణి (205) ఉదయం 9 గంటల వరకు లాగిన్ కాలేదు. దీంతో వారికి నోటీసు ఇచ్చి వివరణ కోరామని ఓబులేసు తెలిపారు.



స్వామివారి వాహనసేవలో పాల్గొన్న పద్మశాలీయులు

భావనారుషి స్వామికి వాహనసేవలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి వాహనసేవలు నిర్వహించారు. షరాఫ్ బజారులోని శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా స్వామివార్లను నెమలి వాహనంపై పట్టణంలో ఊరేగించారు. పద్మశాలీ బహోత్తమ సంఘ శ్రేష్టులు సత్యనారాయణ, కోటేశ్వరరావు, సంఘ అధ్యక్షులు జొన్నాదుల మహేష్, సభ్యులు అక్కల శ్రీరామ్, దివి హేమంత్‌కుమార్, గుంటి వెంకట్, సాంబశివరావు, భాస్కరరావు తదిరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వైసీపీ హయాంలో అరాచకాలు.. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు సృష్టిస్తే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంవైపు రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. శనివారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో వేమూరు నియోజవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన నిర్వహించిన ఆత్మీయ సమావేశం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో జరుగుతున్న తొలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘన విజయంతో గెలిపించుకుందామని అందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకుసాగాలన్నారు. కూటమి పాలన ప్రారంభం నుండి రాష్ట్రానికి, ప్రజలకు చేసిన మంచిని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు వివరించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. వేమూరు నియోజవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు తీసుకోవల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై ఆనందబాబు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నియోజవర్గంలో నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపయోగంగా పబ్లిక్ యూరినరీ టాయిలెట్



పైకప్పు లేకుండా ఫ్లోరింగ్ పగిలిపోయి ఉన్న పబ్లిక్ యూరినరీ టాయిలెట్

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చేవారు మూత్రవిసర్జన బహిరంగ ప్రదేశాలలో చేయకుండా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో వాటర్‌లెస్ యూరినరీ టాయిలెట్స్‌ను ఏర్పాటుచేశారు. వాటి నిర్వహణలో లోపాలు తలెత్తడంతో అవి నిరుపయోగంగా మారాయి. స్థానిక మారీసుపేటలోని యడ్లలింగయ్య పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న పబ్లిక్ వాటర్‌లెస్ యూరినరీ టాయిలెట్ అందుకు నిదర్శనం. నిత్యం ఆ ప్రాంతంలో యూరిన్‌కి వెళ్లాల్సివస్తే టాయిలెట్ పక్కన బహిరంగంగానే వెళ్లవలసిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలు వినియోగించుకునేలా టాయిలెట్ నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హాస్టల్ అభివృద్ధికి కృషి అభినందనీయం



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాత భువనేశ్వరరావు, గోపాలకృష్ణ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎం కాలనీలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో మౌలిక వసతుల కల్పనకు దాత సూర్యదేవర భువనేశ్వరరావు సహకరించడం అభినందనీయమని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. శనివారం హాస్టల్‌లో దాత సహకారంతో ఫ్యాన్లు, విద్యార్థినులకు నూతన వస్త్రాలను, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. దాత సహకారంతో హాస్టల్‌ను రీమోడల్ చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సెక్రటరీ కృష్ణమోహన్, శ్రీనివాసరావు, అనీల్, హరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ



బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

చేబ్రోలు, ఫిబ్రవరి1: విజ్ఞాన యూనివర్సిటీలో జరిగిన బాలోత్సవంలో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు తెలిపారు. శనివారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం పాఠశాలలో జరిగింది. పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. దాసరి ధరణి తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. క్విజ్‌లో ఐశ్వర్య కే.బాల భవ్య శ్రీ, కే.హారిక ప్రథమ స్థానం సాధించి మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన బంజారా నృత్యం ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా బాలోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా..

● సంఘ మండల అధ్యక్షుడు రమేష్

కొల్లిపర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు అన్నవరపు రమేష్ అన్నారు. శనివారం కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశానికి ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు మునగాల రామలక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడుగా అన్నవరపు రమేష్, ఉపాధ్యక్షుడుగా దాసరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చుండూరు వెంకటరత్నం, గౌరవ అధ్యక్షుడుగా మునగాల రామలక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా బొలిశెట్టి హరీష్, కోశాధికారిగా కాజా శివవెంకటప్రసాద్‌ను ఎన్నుకోవడంతో వారిచేత ఆర్యవైశ్య సంఘ నాయకులు ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు మునగాల చినసుందరరామయ్య, మునగాల వీరరాఘవయ్య, బొలిశెట్టి వంశీ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ సభ్యులు